# నాగన్న

[ మహేశ్వర్ ]

●

"అబ్బాయికి పదిహేనేళ్లు వచ్చేయి కదూ!" అన్నాడు వీరన్న—పెళ్ళాం ముఖంకేసి చూస్తూ.

ఔనన్నట్టు తలూపిందామె. పదిహేనేళ్ళ కొడుకు నాకే ఉన్నాడన్న గర్వంతో.

"ఇప్పటినుంచీ అబ్బాయిని పనిలో పెడితే బావుంటికదూ, రెక్కలొచ్చేదాకా పెంచేం—ఇహ నేను ముసలివాణ్ణయిపోయేనన్న విచారం లేదు. అబ్బాయ్ చేతికందొచ్చేడు. అదేచాలు."

"అప్పుడే ఏంతొందరండీ? ఏదీ కుర్ర నాగమ్మకి నిండా పదహారున్నాయి గాని పూర్తిగా కళ్ళయినా విప్పలేదు. అప్పుడే ఆ చక్రాలకింద పెట్టి నలిపేస్తే."

'అంతటిముద్దయితే చచ్చేకాలానికిమూతిమీద నీళ్ళు కూడా ఉండవ్-ఏం- మా నాన్న పద్నాలుగో ఏట పన్లో ప్రవేసించేడు. నేను పదిహేనో ఏట పని ప్రారంభించేను. ఇదీ ఒక విధమైన తరతరాల నుండి వస్తూన్న ఆచారం! తండ్రి తాలూకు పనిలో ప్రవేసించేడూ అంటే నాకెంతగౌరవం!"

"మీరింతకాగు ఎంతన్నా అబ్బాయిని ఆ గనికి అప్పజెప్పను."

ఇంతలో నాగన్న నాజూగ్గా పొట్టిగా, ఉంగ్రాల జుట్టు ఎగేసుకుంటూ వచ్చాడు.

"ఏమిటే అమ్మా?"

"నువ్వు ఉద్యోగస్తుడువి కాపోతున్నావురా నాయనా! మీనాన్నగారి ఉద్యోగంలో ప్రవేసించి అంతకన్న అధికమైన గౌరవాన్ని డబ్బుని సంపాదించాలి!"

"నాన్నగారూ! నేను పుట్టినందుకు సార్థకం ఏమిటంటే ఆ బొగ్గుగనిలో బానిసలకి బానిసనై మిమ్మల్ని పోషించాలన్నమాట."

"లేదు—ఇరవై నాలుగ్గంటలూ బొమ్మలు గీస్తూ కూచో- జన్మ సార్థకంఔతుంది."

"ఏదీ—మరొక్కసారి మనసార అలా దీవించరూ?"

"నాగూ! నిన్నింతవరకూ పెంచింది వృథా! కాని. రేపు నాతో గనిలోకి రాడానికి సిద్ధంగా వుండు. ఇహ నీబొమ్మలాటకి రేపటితో స్వస్తి."

"ఈవిధంగా నన్ను శిక్షించడం మీకు ధర్మంగా లేదు. నన్నా మహాగనికి బానిసగా చెయ్యకండి భిక్షంఎత్తి మిమ్మల్ని పోషిస్తాను!"

"అబ్బా! మహా నీతులు నేర్చేవ్- కూర్చొని బొమ్మలు గీసుకుందికి మీతాతలు గణించిన ఆస్తి లేదు. నేనంతకన్నా ఆర్జించలేదు."

బానిసనుకన్న తండ్రి- బానిసగా బతికేడు. బానిసజీవితాన్ని ప్రోత్సహించిన నిర్భాగ్యదేశాన్ని బానిసదేశంగా తయారుచేసేరు. అనుకుంటూ, కన్నీళ్లు కారుస్తూ, వెళ్ళిపోబోతూన్న నాగన్నని ఆపి:

"రేపు నాతో రాకుంటే నీ బొమ్మలన్నీ తగలేస్తాననుకో!!" అన్నాడు.

* * *

తండ్రితో కలసి గనిలోకి దిగుతున్నాడు నాగన్న! ఆగుహా గహ్వరం ద్వారా వెళ్తూంటే పులినోట్లోకి పోతున్నాననుకున్నాడు.

"నాన్న నన్నెంతలోతుకు లాక్కుపోతున్నాడు! అంతా చీకటి! బొగ్గుగని కదూ!! వెలుగునితరిమే మసిపొరలు!! నాన్నహృదయం వికసించకపోటాన్కి ఈ బొగ్గు గాలీ వెలుగులేని మహాకూపం. కారణం!! ఎంతచిన్న మాటైనా నాన్న బొగ్గుమనస్సుని అవలీలగా మండించేస్తుంది!"

ఇంతలో గనిలో దీపాలు దగ్ మని వెలిగేయి. మరలన్నీ తిరగనారంభించేయి. అనేకమంది కూలీలు మరలకన్న వడిగా పనిచేస్తున్నారు, బొగ్గుకన్న మలినంగా ఉన్నారు. బొగ్గు బానిసలు!!

"వీళ్ళజీవితాలు ఆద్యంతం బొగ్గుల్లోనే బొగ్గయిపోతాయి! వీళ్ళకి ప్రపంచం అంతా చీకటిగానే కన్పిస్తుంది." అనింకా ఏవేవో అనుకుంటూంటే ఓచిన్న గూడ్సుబండీ బొగ్గుల బరువుతో ఆయాసంగా ఆగింది. నాగన్నతో కూడ వీరన్న ఆబండీ ఎక్కాడు.

గనంతా ప్రతిధ్వనించేటంత కూతకూసి బయల్దేరి పోయింది, బండీ!!

నాగన్నతండ్రి బొగ్గుబళ్ళ క్లీనర్ గా 40 ఏళ్ళ నుండి పనిచేస్తున్నాడు. ఇహ నాగన్న కూడా సునాయాసంగా ఆపని నిర్వర్తించగలడు.

* * *

నాగన్నకి వారంరోజుల గనిజీవితం కొత్త కొత్త అభిరుచుల్నీ, కొత్తకొత్త పాఠాల్నీ నేర్పింది. ఆ అభిరుచులే అతనిలో విజ్ఞానాన్ని పూర్తిగా జాలిగించేయి. దాని ఫలితమే "బొగ్గు బానిస" అనే చిత్రం తయారైంది.

గని మేనేజర్ కి ఆ చిత్రాని మూలపూజకి కానుకగా పంపించేడు. ఆచిత్రాన్ని చూచి మురిసిపోయేడు మానేజర్.

అగనికి శాశ్వతాలంకారంగా ఆ చిత్రాన్ని చక్కని దీపాలమధ్య అలంకరించేడు. కాని ఒక్క సందేహం మాత్రం అతన్ని పీడిస్తోంది.

చక్కని దేహదార్ఢ్యం- తెల్లని శరీరం- సన్నని చెక్కిళ్ళు-గల నవయౌవన పురుషవిగ్రహం! అంతచక్కగ కుర్రాడి బొమ్మగీసి "బొగ్గుబానిస" అని పేరుపెట్టడంలో చిత్రకారుడి ఉద్దేశం కించిత్తూ బోధపడలేదు. అతన్నే అడిగి ఆసందేహం తీర్చుకుందామని,

"వీరన్నా నీకొడుక్కి ఏభై రూపాయల ఉద్యోగం ఇస్తే ఒస్తాడా?" అన్నాడు.

"కళ్ళకద్దుకుని మరీని" అని వీరన్న యుద్ధరంగంలో జయంపొంది ఇంటికిమరలే వీరుడిలా బయల్దేరేడు.

"నాగన్నా—నాకన్నా గొప్పవాడివి సుమా!" అన్నాడు ఇంటికొచ్చి ఇంకా కాళ్లైనా కడుక్కోకుండా!

"ఇన్నాళ్ళకైనా నాలో గొప్పతనాన్ని గుర్తించేవ్" ఎంత అదృష్టం అనుకున్నాడు. తన తండ్రి తన చిత్రలేఖనాన్నే ప్రశంసించబోతాడనుకుని.

"నీకు మా మానేజర్ రూ 50 లు ఉద్యోగం ఇస్తానన్నాడు. రేపే ప్రవేశించాలి!"

"రేపే చచ్చిపోవాలి—! అంటే నాకెంత ఆనందంగా ఉండును."

"ఊం...!"

"నాన్నగారూ! ఆఖరిసారిగా చెప్తున్నాను. నేనాగనిలో పనిచేయను."

"నీబొమ్మలన్నీ కాలిపోతాయన్న సంగతి మరచిపోయినట్టుంది"

(తరువాయి 39 వ పేజీలో)

(14 వ పేజీ తరువాయి)

నాన్న మనస్సులో ఇవాళ బొగ్గులు వేగంగా రాజుకుంటున్నాయ్! అని సమాధానపర్చుకున్నాడు.

మరి పదిరోజులదాకా ఇంట్లో ఆ ప్రసంగం లేదు. కాని తల్లిమాత్రం నాగన్నకి ఎన్నోవిధాల నచ్చచెప్పింది.

ససేమిరా పొమ్మన్నాడు.

*　　*　　*

ఆనాడు నాగన్న ఇంటికి తిరిగొచ్చేసరికి చిత్రాలన్నీ అగ్నిలో మగ్గిపోతున్నాయి తనతండ్రి ఇంతకన్నా ఇంకేం ద్రోహంచెయ్యలేదనుకున్నాడు.

"నాగన్నా ఇప్పుడేనా గనిలో ప్రవేసిస్తావా ?"

"నన్ను కాల్చినావురే !"

అంటూ తను ప్రాదిపదిలంగా దాచిపెట్టుకున్న ఒకే ఒక చిత్రం సురక్షితంగా ఉందని చూచి మురిసిపోయేడు. ఆచిత్రాన్ని తీసి "కళాబానిస" అని నామకరణంచేసి మళ్ళా ఆమానేజర్ కి పంపించేడు.

ఆచిత్రంలో ప్రకృతిరమణీయ దృశ్యాలమధ్య, చింకిగుడ్డలు కట్టుకుని నృత్యంచేసే ఒకానొక అభాజనుణ్ణి, అతిచక్కగా చిత్రించబడివుంది.

మర్నాడు ప్రొద్దుటే ఎవరో ఒక కవరుతెచ్చి వీరన్న చేతికిచ్చి వెళ్ళిపోయాడు. కవరు చించి చూడగా ఓ 5 వేల రూపాయల చెక్కు "బొగ్గు, కళాబానిస చిత్రాలకి నాయధోచిత సత్కారం" అడుగున మానేజర్ సంతకం!

"ఏదీ మానాగన్న ? అంటూ గని అంతా పిచ్చికేకలతో పరుగెడుతూంటే చిత్రంలోంచి "కళాబానిస" వికారంగా నవ్వింది.




అందం! అందం!! అందం!!

ఎలా గొస్తుంది?

కేశరీన్ వాడితే......

అందం! ఆనందం!!

నగలు పెట్టుకుంటే అందంరాదు. మంచి చీరలుకడితే అందంరాదు. మరెలాగొస్తుంది అందం? భగవంతుడిచ్చిన కురులే అందాన్నిస్తాయి. ఆనందాన్నిస్తాయి.

అంతేకాని తలవెంట్రుకలు చిన్నవి అయివుండి, సంవరంపెట్టి జడవేస్తే అందంరాదు. కేశములు-అభివృద్ధిఅవడానికీ మార్గంచూడాలి. అందంతో మురియాలి!

అందుకే కేశములకు కలుగు యెటువంటి లోపమైనా పోగొట్టే "కేశరీన్" టానిక్ పోరాయిలు వాడాలి. అమూల్యమైన అందం తెచ్చుకొని ఆనందించాలి.

సీసా వెల 0-12-0 అణాలు.　　అన్ని షాపులలో దొరకును.

వివరములకు :—

విక్టోరియా డిపో, నార్తుమాడా స్ట్రీట్, మైలాపూరు, మద్రాసు.